ఆమె కళ్ళు మూసుకుంది. ఆమెకెందుకో కృష్ణుడు జననం గుర్తొచ్చింది. దానికి అర్థంలేదు. ప్రవక్త-మహమ్మద్ జననం జ్ఞాపకం వచ్చింది. అర్థంలేని భావాల అపురూప సమ్మేళనం..... తన తండ్రి నిస్సహాయ మరణం గుర్తు వచ్చింది. ప్రస్తుతం తన స్థితి అలాంటి నిస్సహాయతే! తన కళ్ళముందే స్వామి గెలుస్తున్నాడు. తనని చూసి నవ్వుతున్నాడు. ఆ సమయానికి ఆకాశంలో చిన్న నక్షత్రం కనిపించింది. అది తనకే కనిపిస్తుంది. మైకులో వస్తూన్న స్వామి కంఠాన్ని అధిగమించి దాని హోరు తనకి వినిపిస్తూంది. ఏమిటది? క్రీస్తు పుట్టినప్పుడు ఆకాశంలో కనిపించిన నక్షత్రమా? ఇది భ్రమా? నిజమా? చుట్టూవున్న పరిస్థితిని చూసి తనమతి భ్రమిస్తుందా? ఆమె కళ్ళు తెరవాలనుకుంది. కానీ తెరచే వున్నట్టు గమనించింది. అది నక్షత్రం కాదు. కానీ గొర్రెల కాపర్లకన్నా ఎక్కువగా ఉత్తేజాన్ని పొందింది. మబ్బుల్ని చీల్చుకుంటూ వస్తోంది ఆకాశంలో చిన్న చుక్క. ఎవరూ గమనించటం లేదు దాన్ని. ఆమె సునిశితమైన దృష్టికే గోచరమవుతూంది అది.

మరింత దగ్గర కొచ్చాక దాని ఆకారం తెలిసింది. గాలిని చీల్చుకుంటూ వస్తోంది.

హెలికాప్టర్.

ధ్వనిని బట్టి దాన్ని గుర్తించిన రెండో మనిషి సి.బి.ఐ. చీఫ్ తలెత్తి చూశాడు. అప్పటికే అది దగ్గరికి వచ్చేసింది.

దానిలోంచి కరపత్రాలు జల్లినట్టు కాగితాలు పడుతున్నాయి. అప్పటికి జనం కూడా దాన్ని గమనించారు. దాని గాలి వేగానికి అంత లావు పేపర్లూ దూదిపింజల్లా చెల్లాచెదురై క్రిందనున్న జనం మీదకి, సముద్రంమీద కురుస్తూన్న వర్షపు చినుకుల్లా రాలుతున్నాయి.

ఉద్వేగంగా ఉపన్యాసం చెపుతున్న స్వామి దృష్టి అప్పుడు పడింది దాని మీద! ఆనకట్ట అడ్డుపడినట్టు వాక్ ప్రవాహం ఆగిపోయింది. అంతలో ఒక న్యూస్ పేపర్ గాలిలోవచ్చి అతడి కాళ్ళముందు పడింది.

***"మతోన్మాది అనంతానంతస్వామి అసలు రంగు"***

తాటికాయంత అక్షరాల్తో మొదటి పేజీలో హెడ్‌లైన్ నల్లగా వికృతంగా తనని పరిహసిస్తూన్నట్టు కనిపించింది.

అతడు నెమ్మదిగా తలెత్తాడు.

పరమేశ్వరం వైపు చూశాడు. ఆ కళ్ళల్లో కోపం కన్నా అతీతమైనదేదో వుంది.

కాటువేయబోయే ముందు పాము అలాగే చూస్తుంది.

నిశ్శబ్దంలోనే అతడి ఆలోచన్లు ఒక రూపు దిద్దుకున్నాయి.

ప్రజలు ఇంకా అయోమయం నుంచి తేరుకోలేదు. అంతా గొడవగా వుంది. పరమేశ్వరం ఈ లోపులో వేదిక దగ్గరగా వచ్చాడు. అతడిని చూస్తూ స్వామి "రుజువుల్తో సహా దొరికిపోయావు పరమేశ్వరం. స్వామి ద్రోహి" అన్నాడు. "వ్యాను నాశనం అయినట్టు అబద్ధం చెప్పావని

మోసాన్ని ఎంత దూరం తీసుకువెళ్దామనుకున్నావు?"

"స్వామీ! ఆవేశపడకండి. నేనిదంతా ఊహించలేదు. ఈ పేపరు తాకిడిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించేందుకు కాస్త టైమివ్వండి. అసలే ప్రజల్లో ఉద్రేకం పెరుగుతోంది."

"ప్రజల తాకిడి ఎలా ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు. ఆ రోజు ప్రవల్లిక నా ఆసనం క్రింద అయుధాలున్నాయని వారెంటుతో వచ్చినప్పుడు భక్తుల నుంచి ఎలా తప్పించావో, ఇప్పుడూ అలాగే తప్పించబోతున్నావు...... ఈ నేరమంతా నీ మీద వేసుకుని--" అంటూ నవ్వేడు. పరమేశ్వరం గతుక్కుమని, "అలా చేస్తే పోలీసులు వెంటనే అరెస్టు చేస్తారు స్వామీ" అన్నాడు.

"చెయ్యనీ కొద్దిరోజుల్లో ఎలాగూ నేను రారాజునవుతాను. నిన్ను విడిపిస్తాను...." అంటూ మళ్ళీ నవ్వేడు.

"కానీ......" అతడిమాట పూర్తికాలేదు.

"అంటే నన్ను రారాజును చేసేందుకు వేసిన పథకం మీద నీకే నమ్మకం లేదన్నమాట? పరమేశ్వరం! నీ ఒక్కడికే తెలివితేటలున్నాయనుకోకు. మైకు దగ్గరికి రా. నువ్వు చేసిందీ - చేయబోతున్నదీ కూడా నాకు తెలుసు. ఆ అగ్నిజ్వాలల్లో నన్ను సజీవ దహనం చేయబోతున్నా వని కూడా తెలుసు. విషయం అంతవరకూ వస్తే నేను మనిషిని కాదు, రాక్షసుడిని. ఒకసారి అటు చూడు దాదాపు వంద తుపాకులు గురిపెట్టబడి వున్నాయి. అయినా నిన్ను క్షమిస్తాను. కావాలంటే నీ కొడుకుని కూడా క్షమిస్తాను. ఈ విషమ పరిస్థితి నుంచి తప్పించు. ఇది ఆర్డింపు కాదు, బెదిరింపు."

పరమేశ్వరం చుట్టూ చూశాడు. పోలీసు వేశాల్లో వున్న సగం మంది స్వామి మనుష్యులే. వెనుక భక్తుల మీద బాంబులు పడినప్పుడు జరగబోయే అల్లర్లలో - వేరే మతానికి చెందిన పోలీసులు భక్తుల మీద నిర్ధాక్షిణ్యంగా లాఠీచార్జి చేసి కాల్పులు జరిపారంటూ చేయబోయే అభియోగానికి నిదర్శనంగా పోలీసులకి ఆ రకమైన వేశాలు వేసి ఉంచారు. అది కూడా తన పథకమే. తనేం చెయ్యాలి అని పరమేశ్వరం ఆలోచిస్తూ వుండగా స్వామి కంఠం వినిపించింది. "కొంతకాలంపాటు ఈ నేరం నీ మీద వేసుకుని, నువ్వూ నీ కొడుకూ కలిసి ఆడిన నాటకానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటావో మరి కొద్దిక్షణాల్లో జరగబోయే అల్లర్లలో మూడో కంటికి తెలియకుండా మరణిస్తావో ఆలోచించుకో పరమేశ్వరం ---"

పరమేశ్వరం ఒక నిర్ణయానికి వచ్చినట్టు వేదిక నెక్కాడు.

*            *            *            *

హెలికాప్టర్ తన పని పూర్తిచేసినట్టు దూరంగా వెళ్ళిపోయింది.

జనం పేపర్లు చదువుతూనే ఉన్నారు.

కానీ అదంతా ఎవరో ప్రత్యర్థివర్గం చేసినపనిగా భావిస్తున్నారు. అంతే తప్ప స్వామి మీద

ట్రూపుని ఆ విధంగా నడిపిస్తాడు. తీరా అంతా చేసేక ప్రత్యర్థి అనుకున్నచోట లేకపోవచ్చు. లేదా మరింత తెలివితో పక్కనుంచి దెబ్బతీయొచ్చు. అంతా చేస్తే అక్కడేమీ దొరక్కపోవచ్చు. ప్రస్తుతం పరిస్థితి అలాగే వుంది. జనం డిస్టర్బ్ అయిన మాట నిజమే. కానీ అది సరిపోదు. తమ వార్తల ద్వారా జనంలో చైతన్యం తీసుకు రాగలిగే శక్తిని దినపత్రికలు ఎప్పుడో కోల్పోయాయి. ఇంకా ఏదో కావాలి.

సునాదమాల ప్రవల్లిక వేపు చూసింది. విష్ణు కూడా ఆమె అనుమతి కోసం చూశాడు. “అప్పుడే కాదు” అన్నట్టు ప్రవల్లిక తల అడ్డంగా వూపింది. అంతలో పరమేశ్వరం కంఠం వినిపించింది మైకులో.

“నేనిలా మధ్యలో స్టేజి ఎక్కటం మీకు ఆశ్చర్యంగా వుండవచ్చు - నేను స్వామి అనుంగు శిష్యుడిని. మీ ముందు ఆకాశం లోంచి జారిన పేపర్ల విషయమై వివరణ ఇవ్వటానికి మీ ముందు కొచ్చాను.”

స్వామి పెదవులమీద సంతృప్తిగా నవ్వు కదిలింది. పరమేశ్వరం కొనసాగించాడు.

“.....తెలివైనవాళ్ళు రెండు రకాలు - దాన్ని అమ్ముకునేవాళ్ళు ఆత్మాభిమానం వున్నవాళ్ళు! మనిషి శారీరకంగా గాయపడి, ఆర్థికంగా నష్టపోయినా, మానసికంగా దెబ్బతిన్నా తట్టుకోగలడేమోగానీ, అతడి “ఈగో” దెబ్బతింటే మాత్రం తల్లక్రిందులవుతాడు. అప్పుడే అతడికి అత్మాభిమానం గుర్తుకొస్తుంది. నాకిప్పుడు అదే గుర్తుకొస్తుంది. అవును, నేనీ దేశపు మేధావిని. స్వార్థానికి అమ్ముడుపోయినవాణ్ని! ఇప్పుడిప్పుడే మేల్కొంటున్న వాడిని!”

స్వామి పెదవులమీద నవ్వు మాయమైంది. మొహం చిట్లించి చూశాడు. ప్రవల్లిక కూడా స్థబ్దురాలై అతడేం చెప్పబోతున్నాడా అని చూస్తూంది.

“ఆ.... పేపర్లో వ్రాసినదంతా నిజమే. అందులో నాకూ భాగం వుంది. స్వామికి మతతత్వాన్ని రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించమని సలహా ఇచ్చింది నేనే --” పేరుకున్న నిశ్శబ్దంలో అతడి మాటలు బాంబుల్లా పేలాయి.

ఒక్కసారిగా జనంలో గోల బయల్దేరింది.

స్వామి కంగారు పడ్డాడు. కానీ క్షణం సేపే! వెంటనే సర్దుకుని తన వాళ్ళ వైపు చూశాడు. అతడు సైగచేసే లోపులో అతని వెనుక ఏదో గుచ్చుకుంది. తలతిప్పి చూస్తే ప్రవల్లిక. చాలా స్నేహ పురస్కారంగా నిలబడ్డట్టు నిలబడింది. కానీ తన డొక్కలో గుచ్చుకున్నదేమిటో అతడికి తెలుసు. తన సైగల్ని ఆపే ఆయుధం.

ఈ లోపులో పరమేశ్వరం కొనసాగించాడు. “నా దుష్ట ఆలోచనలకీ, స్వామికి ఇంతకాలం సాయపడినందుకూ, నాకు నేనే శిక్ష వేసుకోవాలనుకున్నాను. ఆ అగ్నిప్రవేశం నేనే చేస్తాను.” తన జీవితంలో ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంటునట్టు అతనన్నాడు.

ప్రజలు స్థబ్దులై వింటున్నారు. కలకలం తగ్గి ఉత్సుకత పెరిగింది.

“నేను చేసిన పాపాలకి దేవుడు నన్ను క్షమిస్తే..

వస్తాను. లేకపోతే అందులోనే మాడి మసి అయిపోతాను" అంటూ వేదిక దిగి అగ్నిగుండంవేపు నడుస్తూ స్వామి దగ్గర ఆగాడు. "నన్నే నమ్మలేదుగా స్వామీ! ఇప్పుడు చూడు" అన్నట్టుంది ఆ చూపు. స్వామి నిరుత్తరుడయ్యాడు. అతడూహించని మలుపు అది. ఈ లోపులో పరమేశ్వరం అక్కణ్నుంచి కదిలి అగ్నిలో ప్రవేశించాడు. జనం దిగ్భ్రమతో చూస్తున్నారు.

మంటల మధ్య అతను చేతులు జోడించి జనానికి కనబడుతున్నాడు.

ఉన్నట్టుండి జనంలో ఎవరో "హర హర శంభో" అని అరిచారు. అంతే! వెల్లువలా భక్తిధ్వానాలు మిన్నుముట్టాయి. జనాన్ని కంట్రోల్ చేయటం కష్టమైపోయింది.

నిముషం తర్వాత మంటల్లోంచి అతడు బయటకు వచ్చాడు. స్వామికి మాత్రమే వినబడేటట్టు "తెగేవరకూ లాగావు స్వామీ! అనుభవించు" అన్నాడు. మధ్యలో ఎంత కృత్రిమమైన జాలు వున్నా, చుట్టూ వున్న వేడికి అతడి శరీరం అక్కడక్కడా కాలింది. స్వామిలాగా అతడు ముందు మంటల కోసం ప్రిపేర్ అవక పోవటం వల్ల జరిగిన ప్రమాదం అది అయితే తనకా మాత్రం శిక్ష పడాలనుకున్నాడు. పొగ వల్లా - గాయాలవల్లా స్పృహ తప్పుతున్నట్టు అనిపించింది. తూలుకుంటూ మైకు దగ్గిరకి వెళ్ళాడు. "దేముడు నన్ను క్షమించాడు. ఒక ద్రోహికి సాయపడినందుకు దేముడు కొద్దిశిక్షతో వదిలేశాడు. ప్రజలారా! ఇప్పుడిక మీవంతు అసలు ద్రోహిని ఎలా శిక్షిస్తారో మీ ఇష్టం" అంటూ క్రిందకి జారిపోయాడు.

జరుగుతున్నదంతా చూస్తూ స్వామి ఆవేశంతో కదిలిపోతున్నాడు. కళ్ళముందే పరిస్థితులు తనని నిస్సహాయంగా కట్టిపడేయటం సహించ లేక పోతున్నాడు. ప్రవల్లిక చేతిలో ఆయుధాన్ని కూడా లెక్క చేయకుండా తన వాళ్ళకి సైగ చేయబోయాడు.

ప్రవల్లిక కూడా పరిస్థితిని గమనిస్తూనే వుంది. చిన్న మంట తగిలితే పేలటానికి సిద్ధంగా వున్నట్టుంది అక్కడి వాతావరణం. "ఏదో చెయ్యాలి-- కానీ ఏం చెయ్యాలి?" అని తోచక జనం సందిగ్ధంలో వున్నట్టు తోచింది. అప్పుడు చూసింది ఆమె విష్ణువేపు. అప్పటివరకూ ఆమె అనుమతి కోసమే చూస్తున్నట్టు నిలబడ్డ విష్ణు వంగి రాయి తీశాడు. ఆమె తలూపింది.

"నేను పాడితే మా స్నేహితులందర్నీ వదిలేస్తారా అంకుల్!" అని అయోమయంగా అడుగుతున్న వినీల్‌ని..... 'సారే జహాఁసె అచ్చా హిందుస్తాఁ హమారా' అని పాడుతున్న వాడిని - నిర్దాక్షిణ్యంగా కాల్చేసిన స్వామి అసలు రూపం విష్ణు ముందు కదిలింది. జనంలోంచి ఒక్క అడుగు ముందుకొచ్చి గురిచూసి రాయి విసిరాడు. అంతే! అదీ ప్రారంభం. దాదాపు అయిదారు వందలమంది కుర్రాళ్ళు, వయసులో చిన్న వాళ్ళు, ప్రవాహంలో కదిలివచ్చారు. ఈ దేశపు మాతృ మౌఢ్యాన్నీ, అరాచకత్వాన్నీ, స్వార్థాన్నీ ఎదుర్కొనే ఏకైక శక్తిలా వుంది ఆ దృశ్యం. అంతమంది చిన్నపిల్లలు అంతా కదిలి వస్తూంటే, చిన్న చిన్న చీమలు ఒక పెద్ద స్థంభాన్ని పడగొట్టటానికి ఏకమై వచ్చినట్టు వుంది. భవిష్యత్తు మీద చిన్న ఆశ- "మేమున్నాం, మీరు భయపడకండి, రాబోయే తరంలో ప్రస్తుతం మీరు పరిష్కారం కాని సమస్యల్ని మేము పరిష్కరిస్తాం" అని ఆ బాలసైన్యం యుద్ధభూమికి తరలి వచ్చినట్టుంది. అది ఆఖరి పోరాటం.

కాదు. అవాంఛనీయం మీద ప్రథమ పోరాటం. అందులో కొంతమంది వినీల్ మరణాన్ని ప్రత్యక్షంగా చూసిన కుర్రవాళ్ళు- ఎన్నాళ్ళ నుంచో తమ కసిని మనసులో దాచుకున్నారో, ఎన్ని రోజుల్నుంచీ ఈ రోజు కోసం ఎదురు చూశారో.... ఈ రోజు విచ్చుకంటున్న పూలలా వున్నాయి. ఆ రాళ్ళు జల్లులూ నిరూపించాలంటే ఎన్ని సాక్ష్యాలు కావలసి వచ్చునో, ఎన్ని చట్టాలు వెదకవచ్చునోగానీ, ఇప్పుడదేమీ లేదు. అది మార్షల్ కోర్టు! అక్కడున్నది భావి భారత పౌరులు. హిందుస్తాన్‌ని నిజంగా "సారె జహాసె అచ్ఛా' చేయాలనుకుంటున్న వాళ్ళు. వాళ్ళకి ఏ సాక్ష్యమూ, ఏ చట్టమూ అవసరం లేదు.

ఈ హడావుడిలో అనుచరులకి ఏం చెయ్యాలో తోచలేదు. స్వామీ శరీరం రక్తసిక్తమవుతూంది. వెనుకనుంచి బాంబులు విసరటం మొదలు పెట్టారు. సి.బి.ఐ. చీఫ్, పోలీసు అధికారులు అంతా పరుగెత్తారు. వెనుక బాంబులు పేలటంతో జనం కంగారుపడ్డారు.

ఈ హడావుడిలో స్వామికి కాస్త టైము దొరికింది. జనం దృష్టి వెనుకనుంచి జరుగుతూన్న విస్ఫోటనం వేపు మళ్ళగానే మంటలదిశగా పరుగెత్తాడు. చుట్టూ జనం ఎటూ దారిలేదు! ఆ మంటల మధ్య కృత్రిమ జ్వాలలున్నాయని అతడికి తెలుసు. క్రింద నుంచి వాటి ఆవిర్భావం జరుగుతూ వుంటుంది. అదొక్కటే మార్గం అని అటు వెళ్ళాడు.

మంటల మధ్యకి చేరుకుని క్రింద నిప్పుల్లా కనబడుతున్న రెడ్‌బ్రిక్స్‌ని కాళ్ళతో తొలగించాడు. క్రింద ట్రాప్‌రోడ్ కనబడింది. వంగి దాన్ని తీసుకుని క్రిందకి దిగాడు. అక్కణ్నుంచే రెడ్ ఫ్లేమ్స్ సందుల గుండా పైకి వచ్చేది! వాటిని పంపే అనుచరులు ఏమయ్యారా అనుకుంటూ మెట్లు దిగాడు. జనం భ్రమలోంచి కోలుకోకముందే అక్కణ్నుంచి వెళ్ళిపోవాలి. అండర్‌గ్రౌండ్‌లోంచి భవంతిలోకి దారి వుంది. దానిగుండా భవంతిలోకి వెళ్ళాడు. వెనుక ద్వారం గుండా బయటకు వచ్చాడు. అటువైపు జనం గోల వినిపిస్తూంది. ఇటు నిర్మానుష్యంగా వుంది.

దూరంగా వాహనం వుంది. దాని దగ్గిరకి పరుగెత్తి. డోర్ తీసే స్వామిని చూసి నవ్వుతూ - "హల్లో" అన్నాడు.

*　　　*　　　*　　　*

స్వామి అగ్నిప్రవేశం గావించటం ప్రవల్లిక చూసింది. మంటల్లో ఏదో మోసం వుందని తెలుసుగానీ- ట్రాప్‌డోర్ వుంటుందని వూహించలేదు. అప్పటికే రాళ్ళ దెబ్బతిన్న స్వామి మంటల్లో పడిపోయాడనుకుంది. ఆమె దృష్టి పరమేశ్వరం మీద పడింది. అతడికి చెయ్యి అందిస్తూ....